

శేషజీవితం సంఘ సేవలో... 7

## పొద్దు గూకిందా..?

కనుమరుగవుతున్న పొద్దుతిరుగుడు
భారీగా తగ్గిన పంట
సాగు విస్తీర్ణం



6

## పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే
లక్ష్యం
మంత్రి కొండపల్లి శ్రీనివాస్



7

## పోలీసు స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

గణితం పేపర్ లీక్‌తో విద్యాశాఖ అప్రమత్తం
పకడ్బందీగా నిర్వహించాలని
కమిషనర్ ఆదేశాలు



6

# భక్తిపారవశ్యం..



భూతప్పలు వచ్చేమార్గంలో పడుకున్న భక్తులు



భక్తులపై వస్తున్న భూతప్ప

- వైభవంగా భూతప్ప ఉత్సవాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

మడకశిర రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తరహళ్ళి గ్రామం భక్తితో పరవశించిపోయింది. భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేస్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా సోమవారం భూతప్పల ఉత్సవం వైభవంగా సాగింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సంతానంలేనివారు వేకువజామునే స్నానం చేసి, తడి దుస్తులతోనే భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయనీ, సంతానం ప్రాప్తిస్తుందని వారి విశ్వాసం. మధ్యాహ్న 12 నుంచి ఒంటి గంట వరకు భూతప్ప ఉత్సవాలు వైభంగా సాగాయి. మొదట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా నరసంహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. పూజల అనంతరం భూతప్ప ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలు ముందు వెళ్తుండగా దారికి అడ్డంగా పడుకున్న భక్తులపై భూతప్పలు వచ్చారు. అనంతరం నరసింహస్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఆలయంలో పూజలు చేసి, ఉపవాస దీక్షలు విరమించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

### ఘనంగా జ్యోతుల ఉత్సవం

బ్రహ్మోత్సవాల మూడోరోజు జ్యోతుల ఉత్సవం ఘనంగా సాగింది. మొక్కుబడి ఉన్న భక్తులు భక్తిశ్రద్ధలతో జ్యోతులను చేసి, వాటిని తలపై పెట్టుకుని, కాలినడకన వచ్చి స్వామి వారి ఆలయాల ప్రదక్షిణ గావించారు. వేకువజామునే జ్యోతుల ఉత్సవం ప్రారంభమైంది. రైతులు పండించిన పంటలు స్వామివారి ఆలయంపై వేసి, మొక్కులు తీర్చుకున్నారు. భూతప్ప ఉత్సవాలకు సీఐ రామయ్య ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



గ్రామంలో ఊరేగుతున్న నరసింహస్వామి



రథాన్ని లాగుతున్న భక్తులు

## ఘనంగా సత్యసాయి రథోత్సవం

పుట్టపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ వీధుల్లో శ్రీసత్యసాయి రథోత్సవం సోమవారం కనులపండువగా సాగింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం భక్తులు పర్తియాత్రలో భాగంగా మూడోరోజు సోమవారం సత్యసాయి రథోత్సవం నిర్వహించారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రథోత్సవాన్ని ప్రారంభించారు. కోలాటం, చెక్కభజన ఆడుతూ, భక్తిపాటలు పాడుతూ ప్రశాంతినిలయం గణేశ్ గేటు వరకు రథాన్ని లాగారు. అనంతరం సాయికుల్వంత్ సభామండపంలో భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



అమ్మవారి వేషధారణలో భక్తులు

## కప్పేసిన పొగమంచు



ఏకశిలా నంది విగ్రహాన్ని కప్పేసిన పొగమంచు

లేపాక్షి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): లేపాక్షిని సోమవారం పొగమంచు కప్పేసింది. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు తొలగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. లేపాక్షిలో ప్రసిద్ధిచెందిన ఏకశిలా నంది విగ్రహం, జటాయువు పక్షిని పొగమంచు కప్పేసింది. స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి గజగజ వణికిపోయారు.



పొగమంచులో జటాయువు పక్షి

# కందిపోతోంది..!

- కందిపంటకు ఫెంగల్ తుఫాను దెబ్బ
- రాలిపోయిన పూత
- నల్లగా మారిన కాయలు
- రైతుకు తీవ్రనష్టం



ముదిగుబ్బ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు కంది పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత చాలావరకు రాలిపోయింది. కంది కాయలు నల్లగా మారిపోయి, దిగుబడి తగ్గిపోయింది. దీంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని అన్నదాతలు వాపోతున్నారు. మండలవ్యాప్తంగా 11,400 ఎకరాల్లో రైతులు కంది సాగుచేశారు. కొన్నేళ్లుగా వేరుశనగ నష్టాలు మిగుల్చుతుండటంతో ఈసారి చాలామంది రైతులు కంది పంట పెట్టారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావం కారణంగా కందిపంట ఎదగలేదు. తరువాత ఆగస్టు నుంచి వర్షాలు కురవడంతో దిగుబడిపై రైతులు ఆశలు పెంచుకున్నారు. వారి ఆశలపై ఫెంగల్ తుఫాను నీళ్లు చల్లింది. నెల రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న సమయంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు, వాతావరణ మార్పులకు తెగుళ్లు, పురుగుల బెడద తీవ్రమైంది. దీంతో పూతరాలిపోయి, కాయలు నల్లబాయి దిగుబడి సగం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో సాగుచేసిన కందిపంట ప్రస్తుతం కాయదశలో ఉంది. ఆగస్టు, సెప్టెంబరులో పెట్టిన పంట పూత దశలో ఉంది. ఫెంగల్ తుఫాను దెబ్బకు పూత చాలావరకు రాలిపోయింది. పురుగుల బెడద ఎక్కువైంది. ఖరీఫ్ మొదట్లో సాగుచేసిన కంది పంట ప్రస్తుతం కాయదశలో ఉంది. వర్షాలకు కంది కాయలు నల్లగా మారాయి. గింజలు పడిన కాయలు బూజుపట్టి పనికి రాకుండా పోయాయి.

### పెరిగిన పెట్టుబడులు

ఎకరాలో కంది పంట సాగు చేయడానికి రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఈసారి తుఫాను ప్రభావంతో తెగుళ్లు విపరీతంగా సోకడంతో వాటి నివారణకు మందులు అధిక మొత్తంలో పిచికారీ చేయాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. దీంతో పెట్టుబడి ఎకరాకి మరో రూ.10వేలు పెరిగింది. ఈలెక్కన ఎకరాలో పంట సాగుకు రూ.30వెలు వెచ్చించారు రైతులు. సాధారణంగా ఎకరాకి 8 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. ప్రస్తుతం ఒకట్రెండు క్వింటాళ్లు కూడా రావడం గగనంగా మారిందని కంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కంది క్వింటా రూ.4వేలలోపే ధర పలుకుతోంది. దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడి కూడా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.







పూతరాలి నల్లగా మారిన కందిపంట

### కంది రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మూడెకరాల్లో కందిపంట సాగుచేశా. రూ.90వేలు పెట్టుబడి పెట్టా. తుపాను దెబ్బకు పూత రాలిపోయి, కాయలు నల్లగా మారి దిగుబడులు రాలేదు. దీంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు.

- ఆలం అలీ, కందిరైతు, ముదిగుబ్బ

### నివేదికలు పంపాం

దెబ్బతిన్న కంది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశాం. ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

- లక్ష్మీనరసింహులు, ఎంఏఓ, ముదిగుబ్బ

# ఖాద్రీశుడి సన్నిధి చేరేదెలా?

- ఆలయం వీధి అంతా ఆక్రమణలే
- ఇళ్లలో దుకాణాల నిర్వహణ
- ముందే వాహనాల పార్కింగ్
- భక్తులకు తప్పని తిప్పలు



ఆలయం వీధిలో దుకాణాలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరాలంటే భక్తులు ఎన్నో అవాంతరాలు దాటుతూ వెళ్లాలి. కుంచించుకుపోయిన తిరువీధుల్లో తిప్పలు పడుతూ చేరాల్సిందే. స్వామి దర్శనానికి రోజూ వేలాదిమంది భక్తులు వస్తుంటారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఆలయానికి తిరువీధుల్లో నుంచి చేరుకోవాలి. తిరువీధులే చిన్నగా ఉన్నాయి. పెరిగిన ట్రాఫిక్‌తో అవన్నీ రద్దీగా ఉంటాయి. తేరునుంచి ఆలయ తూర్పు గోపురం వరకు ఉన్న వీధితోపాటు ఇటు హిందూపురం రోడ్డు నుంచి ఆలయానికి ఉన్న వీధి ఆక్రమణలతో నిండిపోయాయి. స్థానికంగా ఉన్న ఇళ్ల యజమానులు ముందు వైపున దుకాణాలు పెట్టుకుని, వ్యాపారాలు చేస్తున్నారు. ఇరువైపులా రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుని, వాటిని ఏర్పాటు చేశారు. ఆలయానికి, మున్సిపాలిటీకి పన్నులు కూడా చెల్లించట్లేదు. దీంతో పెద్దఎత్తున ఆలయ ఆదాయానికి గండిపడుతోంది. ఆలయ దుకాణాలకు రూ.లక్షల్లో వేలం పాటలు పడి, ఆలయం ముందు నిర్వహిస్తున్న వ్యాపారులకు నష్టాలు తప్పట్లేదు. ఆక్రమణలు తొలగించడానికి మున్సిపల్, ఆలయ అధికారులు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

### ఆలయంలోకి వెళ్లాలంటే ఇబ్బందులు

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి వెళ్లడానికి రెండు, మూడు దారులున్నాయి. తేరువద్ద నుంచి ఆలయ తూర్పుగోపురం వరకు ప్రధాన రోడ్డు ఉంది. ఈ రహదారిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లడానికే తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. భక్తులు నడిచి వెళ్లడానికి కూడా కష్టాలే. శుక్ర, శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో భక్తులు ఆలయానికి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈదారిలో ఇరువైపులా దుకాణాలు నిర్వహిస్తున్నారు. రెండు వైపులనుంచి 15 అడుగుల మేర ఆక్రమించుకుని, దుకాణాలు ఏర్పాటు చేశారు. మిగిలిన పది అడుగుల స్థలంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, భక్తులు నడుచుకుంటూ వెళ్లడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా రెండు కార్లుకానీ, ఆటోలుకానీ వస్తే ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇది చాలదన్నట్లు దుకాణాల ముందు ద్విచక్రవాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇన్ని అవాంతరాలు దాటుకుని, ఆలయంలోకి వెళ్లడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



ఆక్రమణతో కుంచించుకుపోయిన రహదారి

### మున్సిపాలిటీ, ఆలయ ఆదాయానికి గండి

ఆలయ వీధి, హిందూపురం రోడ్డునుంచి ఆలయనికి వచ్చే రోడ్డులో పలువురు ఇళ్లలోనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. వ్యాపారాలు కూడా బాగానే సాగుతున్నాయి. తాము పొందుతున్న లాభంలో కొంత ఆలయానికి ఇవ్వడం అన్ని ప్రసిద్ధ క్షేత్రాల్లో ఆనవాయితీగా ఉంది. కొన్ని ఆలయాల పరిధిలో నిబంధనగా అమలు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదు. దుకాణాలు నిర్వహించడానికి మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సి ఉంది. ఇళ్లలో దుకాణం నిర్వహిస్తే అది కమర్షియల్ విభాగం కింద గుర్తించి, ఆ మేరకు పన్ను చెల్లించాల్సి ఉంది. ఈ రెండు జరగడంలేదు. మున్సిపాలిటీ అధికారులు ఎక్కువశాతం ఇళ్లకు సాధారణ పన్నులు విధించినట్లు సమాచారం. ఎక్కువ దుకాణాలకు ట్రేడ్ లైసెన్సు లేనట్లు తెలిసింది. తద్వారా మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది.

### నష్టపోతున్న ఆలయ దుకాణ వ్యాపారులు

ఆలయ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి అధికారులు ఏటా వేలం పాటలు నిర్వహించి, దుకాణాలు అద్దెకిస్తారు. వీటిలో వ్యాపారం చేసుకునే హక్కు దుకాణదారులు కలిగి ఉంటారు. ఇక్కడ దుకాణాల్లో అమ్మే సామగ్రి ఆలయం వీధిలో పలు వ్యాపారులు అమ్ముతుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు అంటున్నారు. రూ.లక్షలు అద్దెతోపాటు, జీఎస్టీ చెల్లించి, దుకాణాలు తీసుకున్నామన్నారు. తమ దుకాణాల్లో అమ్మే టెంకాయలు, ఇతర సామగ్రి బయట కూడా విక్రయిస్తుండడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నట్లు వాపోతున్నారు.

**పరిశీలించి, చర్యలు తీసుకుంటాం: కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్**

ఇళ్లలో దుకాణాలు నిర్వహిస్తుంటే పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. వ్యాపార సముదాయాలకు పన్నులు వేసి, ట్రేడ్ లైసెన్సు జారీచేస్తాం. రోడ్డు ఆక్రమణపై రెవెన్యూ, దేవదాయ, పోలీసు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం.

**ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం: - శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ**

ఆలయానికి రావడానికి భక్తులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటాం. ఆలయ వీధిలో అక్రమణలు ఉంటే వివిధ శాఖాల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

# ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 210 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాల సమస్యలకు మండలస్థాయిలో పరిష్కారం లభిస్తుందనీ, ఈవిషయం తెలియక ప్రజలు జిల్లాకేంద్రానికి వస్తున్నారన్నారు. దీనిపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తే ఈ సమస్య రాదన్నారు. అర్జీదారుడు సంతృప్తి పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేకకుమార్, డీఆర్వో విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణ

విద్యుత్ శాక ఆధ్వర్యంలో రూపొందించిన ఇంధన పొదుపు పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్ ఆదా పరికరాలను వినియోగించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర, ఈఈ శివరాం పాల్గొన్నారు.

### డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన కార్యక్రమంలో 35 ఫిర్యాదులు అందాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూస్‌బాక్స్

### పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. సహకార సంఘం ద్వారా ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక ప్రయోజన వెసులుబాటు వంటివి కలుగుతాయన్నారు. ప్రతి ఐదుసంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన డైరెక్టర్లకు సంఘం నిర్వహణ బాధ్యతలు అప్పచెబుతున్నట్లు పేర్కొన్నారు. జనవరి 12న ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. ఆసక్తిగల వారు జనవరి 7నుంచి నామినేషన్లు దాఖలు చేయాలని కోరారు. 9న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 12నిర్వహించే ఎన్నికల్లో సంఘ సభ్యులు పాల్గొని వారి ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలోని ఉద్యోగుల పరపతి సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### 'గిరిజన టీచర్ల సమ్మెకు పరిష్కారం చూపాలి '

అనంతపురం విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయుల సమ్మెకు పరిష్కారం చూపాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ ప్రభుత్వాన్ని సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న గిరిజన టీచర్లు, అధ్యాపకులు 1659 మంది తమ డిమాండ్ల సాధనకు గత 31 రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. టీచర్లు, అధ్యాపకుల సమ్మె మూలంగా గిరిజన గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అవుట్ సోర్సింగ్ వారిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ) లుగా పరిగణించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఆర్సీ 2022 మేరకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ-2024 నుంచి వీరు పనిచేస్తున్న పోస్టుల ఖాళీలను సైతం మినహాయించాలని కోరారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వీళ్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ లేఖ రాసినట్టు ఆయన స్పష్టం చేశారు.

### రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించిన ఐదుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీస్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం జోనల్ హెడ్ క్వార్టర్సులో జీఎం అరుణ్ కుమార్ జైన్ సోమవారం జోన్ వ్యాప్తంగా 13 మంది ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించారు. రైల్వే భద్రత విషయంగా అప్రమత్తతతో వ్యవహరించినందుకు గుంతకల్లు డివిజన్‌లో ఐదుగురికి, సికింద్రాబాద్ డివిజన్‌లో నలుగురికి, విజయవాడ డివిజన్‌లో ఇద్దరికి, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లో ఒక్కొక్కరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు.

### తాడిపత్రికి చేరిన డ్రోన్ కెమెరా

తాడిపత్రి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ కెమెరా తాడిపత్రికి చేరింది. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా సాయంతో సోమవారం రెండు డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ సమీపంలోని అక్కన్నపల్లి, యల్లనూరు రోడ్డు, పుట్లూరురోడ్డు, ఆటోనగర్, శివాయం వద్ద, సాయిబాబా ఆలయం వద్ద, బ్రిడ్జీ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. వీటిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించిన డ్రోన్ కెమెరా

# పొద్దు గూకిందా..?



పొద్దుతిరుగుడు పంట

## కనుమరుగవుతున్న పొద్దు తిరుగుడు

### భారీగా తగ్గిన పంట సాగు విస్తీర్ణం

బొమ్మనహాళ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్నేళ్ల కిందట ఎక్కడ చూసినా కనిపించిన పొద్దుతిరుగుడు పంట క్రమంగా కనుమరుగైంది. సాగు ఖర్చు తక్కువగా ఉండటం, దిగుబడి, లాభం అధికంగా ఉండటంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపేవారు. రాను రాను విత్తన నాణ్యత తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో కర్షకులు ఈ పంట సాగును వదిలేశారు. వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగుడు పంట నేడు కనీసం వందల ఎకరాల్లో కూడా కనిపించడం లేదు.

### వేల నుంచి పదుల ఎకరాల్లోకి సాగు

గతంలో ఖరీఫ్, రబీ సీజన్లో మండల వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను రైతులు సాగు చేసేవారు. మండలంలోని గోవిందవాడ, దర్గహొన్నూరు, బొల్లనగుడ్డం, బండూరు, కల్లుదేవానహళ్లి, హరేసముద్రం తదితర గ్రామాల్లో పొద్దుతిరుగుడు పంటను రైతులు ఎక్కువగా పండించేవారు. గత 15 ఏళ్ల నుంచి మండలంలో పొద్దుతిరుగుడు పంట సాగు రాను రాను తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలంలో కనీసం 20 ఎకరాల్లో కూడా పొద్దుతిరుగుడు పంట సాగు కాలేదు. రైతులు రబీలో వరికి బదులు పొద్దుతిరుగుడు పంట సాగు చేసేవారు.

### దెబ్బతీసిన తెగుళ్లు

ప్రధానంగా పొద్దుతిరుగుడు పంట సాగును తెగుళ్ల దెబ్బ తీసినట్లు రైతులు చెబుతున్నారు. పంటకు వైరస్ సోకడంతో పూత రాలిపోతుంది. దీంతో ఆకులు విపరీతంగా ఎండిపోతూ మొక్క చనిపోతుంది. అదే తరుణంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర కూడా లభించలేదు. పొద్దు తిరుగుడు పంటను తక్కువ నీటి వనరులతో తక్కువ కాలపరిమితి గల పంటగా సాగుచేసే విధానంపై అధికారులు కూడా అవగాహన కల్పించకపోవడంత కూడా పంట సాగు తగ్గడానికి ప్రధాన కారణమని రైతులు అంటున్నారు. ప్రస్తుతం అనేక రకల పంటలకు దిగుబడి వచ్చేందుకు పలు రకాల రసాయనిక మందులు వచ్చాయి. పొద్దుతిరుగుడు పంట దిగుబడి కూడా బాగా రావడానికి మందులు ఉంటాయని, అధికారుల దృష్టి పెట్టి అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

### గిట్టుబాటు ధరలేదు



పొద్దు తిరుగుడు సాగుకు ఖర్చు తక్కువ. అయితే దిగుబడి పడిపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో పొద్దు తిరుగుడు సాగు చేయడం లేదు. మా గ్రామ శివారులో ఎక్కువగా పొద్దు తిరుగుడు పంట సాగు చేసేవారు. ప్రస్తుతం వరిపంట సాగు ఎక్కువగా సాగుచేస్తున్నారు. పొద్దుతిరుగుడు సాగుకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతులు ముందుకొస్తారు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

### సాగును ప్రోత్సహించాలి



పొద్దుతిరుగుడు లాభదాయకంగా ఉండే పంట. అయితే సాగు చేసేందుకు రైతు ఆసక్తి చూపడంలేదు. విత్తనాలు నాణ్యత లేకపోవడం వల్లే పొద్దుతిరుగుడు పంట పండించడం లేదు. అధికారులు శ్రద్ధ చూపి నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వమే సబ్సిడీతో పంపిణీ చేసి సాగుకు ప్రోత్సహించాలి. పొద్దుతిరుగుడు పంట సాగు తక్కువ కావడంతోనే ఆయిల్ ధరలు పెరిగిపోతున్నాయి.

-అంజనేయులు, రైతు, దేవగిరి

### విత్తనాలు రావడంలేదు



మార్కెట్లోకి నాణ్యమైన పొద్దుతిరుగుడు విత్తనాలు రావడం లేదు. మార్కెట్లో దొరికిన విత్తనాలను సాగుచేస్తే దిగుబడి రాదు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలో లేదు. వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినా గిట్టుబాటు కావడం లేదు. మార్కెట్లో నాణ్యమైన విత్తనాలు వస్తే ఖరీఫ్ సీజన్ తర్వాత రబీలో సాగుకు మంచి అవకాశం ఉంటుంది.

- జనార్దనపల్లి రామాంజనేయులు, రైతు, ఉద్దేహాళ్

### వైరస్‌తోనే సాగు తగ్గింది



పొద్దు తిరుగుడు పంటను గతంలో రైతులు ఎక్కువగా సాగు చేసేవారు. అయితే ప్రస్తుతం రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. బటనెక్రోసిస్ వైరస్‌తో పొద్దు తిరుగుడు పంట దిగుబడి తగ్గింది. ఈ వైరస్ ప్రభావంతో మొక్కలు చనిపోతాయి. అందుకే రైతులు పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 50 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగు చేశారు.

- సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

# పోలీసు స్టేషన్‌కు ప్రశ్నపత్రాలు

### గణితం పేపర్ లీక్‌తో విద్యాశాఖ అప్రమత్తం

### పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు

### స్టేషన్లలో భద్రపరచాలని డీఈఓల ఉత్తర్వులు



ఇటుకలపల్లి పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న మన్నీల పాఠశాల ఉపాధ్యాయులు

అనంతపురం విద్య/యాడికి/ కొత్తచెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గణితం పేపరు లీక్ కావడంతో మంగళవారం నుంచి నిర్వహించాల్సిన సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6నుంచి 10వ తరగతులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈనెల 11నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు పరీక్షలు నిర్వహించారు. సోమవారం గణితం పరీక్ష నిర్వహించాల్సి ఉంది. సోషల్‌మీడియా (యూట్యూబ్)లో గణితం పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో సోమవారం నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేశారు. ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి సోమవారం సాయంత్రం ఆదేశాలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంతా సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. ఉమ్మడి జిల్లాల డీఈఓలు కూడా ప్రధానోపాధ్యాయులందరూ ప్రశ్నపత్రాలను స్టేషన్లలో భద్రపర్చాలని సోమవారం ఆదేశాలిచ్చారు. అనంత డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు ప్రశ్నపత్రాల భద్రతపై జిల్లా ఎస్పీని కలిసి లేఖ ఇచ్చారు. జిల్లాలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1.09 లక్షల మంది ఎస్ఏ-1 పరీక్షలు రాస్తున్నారు.

### గణితం పేపర్ లీక్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రైమరీ పరీక్షలు పూర్తయ్యాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం గణితం ప్రశ్నపత్రం లీక్ కావడంతో విద్యాశాఖ రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆగమేఘాల మీద ఈ రోజు జరగాల్సిన గణితం పరీక్షను వాయిదా వేశారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాలోని డీఈఓలు, డీసీఈబీ కార్యదర్శులు అప్రమత్తం అయ్యారు. ప్రశ్నపత్రాలు ఉన్న కాంప్లెక్స్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో వాటిని భద్రపర్చాలని డీఈఓ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 10 వరకూ సుమారు 1.09 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతిలో 23,500 మంది, 7వ తరగతిలో 22,200 మంది, 8వ తరగతిలో 22,700 మంది, 9వ తరగతిలో 21,300 మంది, 10వ తరగతిలో 20,100 మంది చదువుతున్నారు. గణితం, సైన్స్, సోషల్ పరీక్షలు జరగాల్సిన సమయంలో పేపర్ లీక్ కావడంతో గణితం పరీక్ష వాయిదా పడింది. ప్రస్తుతం సైన్స్, సోషల్ పరీక్షల ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్లలో భద్రపరుస్తున్నారు.





బ్రహ్మసముద్రం జడ్పీ స్కూల్ ప్రశ్నపత్రాలున్న పెట్టెకు సీల్ వేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన దృశ్యం

### గతంలో ఇష్టారాజ్యం

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి రోజూ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యేవి. అయినా వాటిని పట్టించుకోకుండా అలాగే పరీక్షలు నిర్వహించి మమ అనిపించేవారు. గత మూడు, నాలుగేళ్లు ఇదే తంతు జరిగింది. ముఖ్యంగా ఎస్‌సీఈఆర్టీలోని ఓ ఉన్నతాధికారి వైఖరి వల్లే ఇదంతా జరిగిందంటూ అప్పట్లో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. విద్యావ్యవస్థల ను ఆయన సర్వనాశనం చేశారంటూ పెదవి విరుస్తూ వచ్చారు. అయితే తాజాగా గణితం పేపర్ లీక్ అయిన విషయం తెలియగానే ఎస్‌సీఈఆర్టీ, కమిషనర్ వెంటనే అప్రమత్తం అయ్యారు. గణితం పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో డీఈఓ, డీసీఈబీ కార్యదర్శి ఆదేశాలతో కాంప్లెక్స్ స్కూళ్ల హెచ్‌ఎంలు పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తుండటంపై సగటు ఉపాధ్యాయుడు, సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రాజీలేని పోరాటం వల్లే గెలుపు

### మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు



మాట్లాడుతున్న సీహెచ్ శంకర్రావు

గుంతకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కారంలో రాజీలేని పోరాటాల వల్లే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందడంపై డివిజనల్ కేంద్రంలో సోమవారం ఉదయం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో శంకర్రావు మాట్లాడుతూ సమస్యలపై చిత్తశుద్ధితో పోరా టాలు చేసి ఉద్యోగుల నమ్మకాన్ని నిలుపుకున్నందుకే ఎన్నికల్లో యూనియన్‌కు ప్రథమ స్థానం దక్కిందన్నారు. ఎనిమిదో వేతన సవరణ సంఘ నియామకం కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. జనవరి 2026కి 8వ పీఆర్సీ సిఫారసులు అమలయ్యేలా పోరాడటమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర రావు, గుంతకల్లు డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్‌లు నారాయణ, మధుసూదన్, అశ్విని, జోనల్ కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఎం శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగుల సంఘ డివిజనల్ నాయకుడు మస్తాన్ వలి, యూనియన్ బ్రాంచ్ కేఎస్ శేఖర్, బాబు, ఎస్ఎం బాషా, రాజశేఖర్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ ఆపరేషన్

### సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

### కోతలేకుండా కణతి తొలగింపు



బాధితురాలితో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు

అనంతపురం టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి న్యూరో సర్జన్లు భాస్కర్, రవితేజ, భాస్కరబాబు, అచ్యుత్ సోమవారం వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన సుజాతాబాయి తీవ్ర తలనొప్పి, చూపు తగ్గడంతో ఇబ్బంది పడేవారు. ఆమెను కుటుంబ సభ్యులు స్విమ్స్ న్యూరోసర్జన్ వద్దకు తీసికెళ్లి చూపించారు. అక్కడ పరీక్షలు చేసిన డాక్టర్లు సుజాతాబాయికి పిట్యూటరీ ట్యూమర్ ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేయాలన్నారు. అక్కడ ఆరోగ్యశ్రీ వ ర్తించకపోవడంతో అంతడబ్బు వ్యయం చేసే స్తోమత లేక తిరిగి వచ్చేశారు. ఈక్రమంలోనే నవంబరు 21న సూపర్ స్పెషాలిటీ ఆ స్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ న్యూరో డాక్టర్లకు చూపించి, గతంలో జరిగిన విషయాలన్ని వివరించారు. దీంతో ఆస్పత్రి న్యూరో విభాగం డాక్టర్లు ఆ కేసును సవాలుగా తీసుకొని ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్ చేస్తామని కుటుంబసభ్యులకు తెలిపారు. వారి అంగీకారంతో ఈనెల 10న ఆమెకు ఎలాంటి కోతలు లేకుం డా ఎండోస్కోప్, మైక్రోస్కోప్ ఉపయోగించి ఆపరేషన్ చేశారు. ఈఆపరేషన్ విజయవంతం కావడంతో సుజాతాబాయి ఆరోగ్యంగా కోలుకున్నారు. అరుదైన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌వెంకటేశ్వరరావు, సూపర్‌స్పెషాలిటీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో అనస్తీషియా డాక్టరు శ్రీహరితోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లతామరకు చెక్ పెట్టండి

### - జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మిరప పంటను కొత్తగా ఆశిస్తున్న నల్లతామర పురుగు నియంత్రణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జేసీ శివ్‌నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మలతో కలిసి కలెక్టర్ నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపే కరపత్రాలను సోమవారం ఆవిష్క రించారు. ఈ కరపత్రాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందజేసి , నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### సామాజిక స్పృహతో రచనలు అభినందనీయం

### - కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సామాజిక స్పృహతో కూడిన రచనలు చేయడం అభినందనీయమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ భవన్‌లోని చాంబర్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత జూటూరు తులసీదాసు రచించిన కాకులు దూరని కారడివి కథా సంపుటాన్ని కలెక్టర్, డీఈఓ ప్రసాద్‌బాబు, రచయిత తులసీదాస్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల మనస్సుకు హత్తుకునేలా సరళమైన పదాలతో కథలు రాయడం బాగుందన్నారు. బాల్యంలో పిల్లలకు నీతిని కథల రూపంలో బోధించడం మంచి ఆలోచనన్నారు. చదువుపై ఆసక్తిని పెంచేలా కథలు ప్రేరణ కలిగించేలా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు, ఎస్ఎస్టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద, సమగ్రశిక్ష ఉద్యోగి గోపాల్, ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### 896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 896 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 514 మెట్రిక్ టన్నులు డీఏపీ, 382 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం ఎరువులు ఉన్నాయని వెల్లడించారు.

### జేఎన్‌టీయూ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని వారాల కిందట ఉద్యోగ విరమణ పొందిన జేఎన్‌టీయూ ఉద్యోగులకు మొత్తం ఆర్థిక ప్రయోజనాలు చెల్లించారు. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల(అడహక్)కు వేతన బకాయిలు చెల్లించారు. అందుకు కృతజ్ఞతగా సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ల (అడ్‌హక్) అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్యను వేర్వేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని ఉద్యోగ, సిబ్బందికి నెల వేతనమే జీవనాధారమన్నారు. గతంలో వారిని విభజించి వైషమ్యాలు సృష్టించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో అలాంటివాటికి చోటులేకుండా ప్రతి ఉద్యోగికి దక్కాల్సిన అన్ని ప్రయోజనాలను చెల్లించేలా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.



వీసీ సుదర్శనరావును సన్మానిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

### సమస్యలపై నేరుగా సంప్రదించండి

### - డీఆర్ఎం విజయకుమార్





పెన్షన్ అదాలత్‌లో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయకుమార్

గుంతకల్లు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): రైల్వే విశ్రాంత ఉద్యోగులకు ఏవైనా జటిల సమస్యలుంటే తనతో నేరుగా సంప్రదించవచ్చని డీఆర్ఎం విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం ఉదయం రైల్వే పెన్షన్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే రిటైర్డు ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారం కోసం పెన్షన్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే తనను నేరుగా కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాపిల్ అరోరా, ఏఐఆర్ఆర్ఎఫ్ డివిజన్ కార్యదర్శి సుంకప్ప, పీపీఆర్ డివిజనల్ అధ్యక్షుడు పీవీవీ ప్రసాద రావు, కార్యదర్శి రంగస్వామి, ఏఐఆర్ఎఫ్ డివిజనల్ ఉపాధ్యక్షుడు కళాధర్ పాల్గొన్నారు.



చిక్కేపల్లి వద్ద గుంతలు పడిన రోడ్డు



యాడికి సమీపాన అధ్వానంగా రోడ్డు

# ఎటు వెళ్లినా గుంతలే..!

### అధ్వానంగా యాడికి-బుగ్గ రోడ్డు

### యాడికి-రాయలచెరువు రోడ్డు దుస్థితీ అంతే..

### కిందపడి గాయపడుతున్న వాహనదారులు

యాడికి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఇటు వెళ్తే గుంత... అటు వెళ్లినా గుంతే. దీంతో ఎటు వైపు వెళ్లాలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం నుంచి బుగ్గకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పై అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు తప్పించుకునే క్రమంలో వాహనాలు కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారు. ఇటీవల బండలను తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై గుంతలను తప్పించబోయి బోల్తాపడింది. అలాగే ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో యాడికికి చెందిన ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అయినా రోడ్డు మరమ్మతులు గురించి పట్టించుకొనే వారు కరువయ్యారని వాహనదారులు, ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే రోడ్డు కూడా గుంతలు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకొనే వారే లేరని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకేమి పట్టదు అన్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారుల చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు చేపట్టి యాడికి-బుగ్గ, యాడికి- రాయలచెరువు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

- నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే లక్ష్యం
- సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పెనుకొండ టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎంఎస్ఎంఈ సెర్ప్ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఏపీఐఐసీ జెడ్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, బ్యాంకర్లు, వారి సమస్యలు సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమలో పరిశ్రమల అభివృద్ధి కోసం మొట్టమొదటి సమీక్షా సమావేశం ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి, నూతన పరిశ్రమలు ప్రోత్సహించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎంఎస్ఎంఈ సమస్యలు మాదృష్టికి వచ్చాయని వాటన్నింటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఆటోమొబైల్, చేనేత పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. ఇవికాకుండా కొత్త తరహాలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందో, ఇందులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏమాత్రం లభిస్తాయో అధ్యయనం చేస్తున్నామన్నారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.



ఎంఎస్ఎంఈ, సెర్ప్ సమీక్షలో మంత్రులు

### ఒక్కొక్కటి సరిచేస్తున్నాం: మంత్రి సవిత



మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, ఒక్కొక్కటే సరి చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఇప్పటికే ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమలు తీసుకురావాలో ఇండస్ట్రీయల్ అధికారులతో సర్వే చేసినట్లు తెలిపారు. త్వరలో నూతన ఇండస్ట్రీ యాజమాన్యానికి పూర్తి సహకారం ఇచ్చి బ్యాంక్ యాజమాన్యంతో రుణాలు అందేలా కృషిచేస్తామన్నారు. ఇందుకుగాను సీఎం చంద్రబాబు సమక్షంలో చర్చలు జరిపి కొత్త పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర, ఎంఎస్ రాజు, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాములు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఉమ్మడి జిల్లాల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

### కక్షపూరిత రాజకీయాలు చేయం

వైసీపీ ప్రభుత్వంలో మాదిరి కక్షపూరిత రాజకీయాలు చేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయనకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనర్హులను తొలగించి అర్హులకు పెన్షన్ ఇవ్వడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ పరిధివరకు పెన్షన్ సమస్యలను టీడీపీ శ్రేణులు తీసుకొస్తున్నాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి ఈ ఐదు నెలల్లోనే చేసి చూపించామన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ తొలిసారిగా ఎమ్మెల్యేలు అయినవారిలో 17మందికి మంత్రి పదవులు అప్పజెప్పారని, అందులో తామిద్దరం కూడా ఉన్నామని, బాధ్యతగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందో స్థానిక స్థితిగతులను అధికారులతో ఆరాతీసి ముఖ్యమంత్రికి తెలియజేస్తామన్నారు.



### బ్యాంక్ రుణాలు ఇవ్వాలి



ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం షూరిటీలేని రుణాలు, క్రెడిట్ గ్యారెంటీలేని రుణాలు అందివ్వాలి. ఉమ్మడి జిల్లాలో ఒకశాతం ఎన్‌పీఏ కూడా లేకపోయిన రుణాలు విరివిగా ఇవ్వడం లేదు. ఎంఎస్ఎంఈలపై అధికారుల దాడులు ఆపి, సమన్వయంతో మా సమస్యలు పరిష్కరించాలి. మూడు లక్షలు జనాభా ఉన్న ప్రాంతాల్లో డిమార్ట్ వంటి సంస్థలకు అవకాశాలు ప్రభుత్వం ఇవ్వకూడదు. వాటి టర్నోవర్ ఇతర రాష్ట్రాలకు వెళ్తోంది. అంతేకాకుండా చిరువ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-బైసాని రాంప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు

### అహుడా నుంచి తీవ్ర ఇబ్బందులు



అహుడా లైసెన్స్ పరిధి నుంచి తొలగించి ఎంఎస్ఎంఈలను ఆదుకోవాలి. గతంలో మాదిరి పంచాయతీ, మునిసిపాలిటీ అనుమతిచ్చేలా చేస్తే ఒక్కో ఎంఎస్ఎంఈలకు దాదాపు రూ.20లక్షలు ఆదా అవుతుంది. అలాగే విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. చార్జీలు తగ్గిస్తే మరింత ఊరట ఇచ్చినట్లు అవుతుంది. బ్యాంక్ యాజమాన్యం రుణ మంజూరులో ప్రాపర్టీ షూరిటీ అడగకుండా రుణాలు ఇవ్వాలి. మన రాష్ట్రంలో తయారు చేసిన వస్తువులు ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాల వస్తువులు నిషేదించాలి. అప్పుడే పూర్తి న్యాయం జరుగుతుంది.

-శేషాంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు

## ధర్మవరంలో మహిళా పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు పరిటాల శ్రీరామ్ వినతి

ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మహిళా పారిశ్రామిక వాడ, స్టిచ్చింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్.. పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు విజ్ఞప్తిచేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం పెనుకొండకు వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను పరిటాల శ్రీరామ్ కలిసి, ధర్మవరం ప్రాంతంలో చేనేతలు పడుతున్న కష్టాలను వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధర్మవరం చేనేత రంగం కొన్నేళ్లుగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. ముడిసరుకుల ధరలు పెరిగి, గిట్టుబాటు ధరలు దక్కక చేనేత రంగం కుదేలైందన్నారు. ధర్మవరం పట్టణంలోనే 50 వేల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయన్నారు. చేనేత వృత్తిలో కీలకంగా ఉన్న మహిళలకు ప్రస్తుతం ఉపాధి లేకుండాపోయిందన్నారు. వారు ఆర్థిక సాయం అడగకుండా తమకు ఉపాధి చూపించాలని కోరుతున్నారని పరిటాల శ్రీరామ్.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 20వేల మందికిపైగా మహిళలకు ఉపాధి కల్పించే దిశగా వారికి ప్రత్యేకంగా పారిశ్రామిక వాడ, స్టిచ్చింగ్ యూనిట్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబునాయుడుతో చర్చిస్తానని పరిటాల శ్రీరామ్‌కు తెలిపారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

**క్రైం కార్నర్**

## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

పెద్దపప్పూరు/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెద్దపప్పూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ఆటోలు బోల్తా పడటంతో ఇద్దరు మరణించారు. పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి టోల్‌గేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. మద్ద చిన్నరాయుడు (48), నరసింహుడు గుత్తి మండలం కొత్తపేట సమీపాన గల కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పనిచేసేవారు. వీరు సోమవారం తాడిపత్రి వైపు నుంచి గుత్తి మండలం కొత్తకోట దగ్గర ఉన్న కాశిరెడ్డి నాయన గుడి ఆటోలో బయలుదేరారు. ఆ ఆటో చీమలవాగుపల్లి టోల్‌గేట్ సమీపంలో బోల్తా పడటంతో మద్ద చిన్నరాయుడు అక్కడికక్కడే మరణించాడు. నరసింహుడు స్వల్పంగా గాయపడ్డాడు. చిన్నరాయుడు మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడ్డ నరసింహుడిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేస్తామన్నారు.


చిన్నరాయుడు మృతదేహం

చెన్నేకొత్తపల్లి మండలంలోని దామాజిపల్లి సమీపంలో సోమవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. న్యామద్దల గ్రామానికి చెందిన ముత్యాలప్ప(45), తన భార్య రమాదేవి, కుమార్తె లాస్యలతతో కలిసి తనసొంత ఆటోలో ధర్మవరం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. దామాజిపల్లి సమీపంలోకి రాగానే కుక్క ఆటోకు అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటో ముత్యాలప్ప మీద పడటంతో తీవ్రం గా గాయపడ్డాడు. భార్య, కుమార్తె కూడా స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ముత్యాలప్ప మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ముత్యాలప్పకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


ముత్యాలప్ప మృతదేహం

## ప్రాణంతీసిన వివాహేతర బంధం

- కాంట్రాక్టర్ హత్య కేసు ఛేదింపు... ఆరుగురి అరెస్టు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లమాడకు చెందిన కాంట్రాక్టర్ బశెట్టి రాజశేఖర్ (49) హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసు విచారణలో తేలింది. ఈ కేసులో పెనుకొండ సమీపంలోని వెంకటగిరిపాలెం గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి, అతడి భార్య రాధిక, వారి బంధువులు ఏపీఎస్పీ కానిస్టేబుల్ సాయినాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సోమందేపల్లికి చెందిన వెంకటేష్, నరేష్‌ను అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కొత్తచెరువు మండలంలోని మైలేపల్లి విజయ్‌కుమార్ ఫాంహౌస్‌లో రాజశేఖర్ ఉంటుండేవాడు. గతంలో పెనుకొండ సమీపంలోని వెంకటగిరిపాలెంలో విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తుండేవాడు. ఆ సమయంలో అదే గ్రామంలో రాధిక హోటల్ నిర్వహిస్తుండేది. రాజశేఖర్.. కూలీల టిఫిన్లు, భోజనాలు కోసమని హోటల్‌కు వెళ్తుండేవాడు. అలా రాధికతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా.. వివాహేతర బంధానికి తెరతీసింది. విషయం రాధిక భర్త రవీంద్రరెడ్డికి తెలిసింది. దీంతో అతడితోపాటు అతడి బావమరిది సాయినాథరెడ్డి (ఏపీఎస్పీ కానిస్టేబుల్).. పద్ధతి మార్చుకోవాలని రాజశేఖర్‌ను మందలించారు. అయినా అతడు మారలేదు. దీంతో రవీంద్రారెడ్డి, సాయినాథరెడ్డి, బంధువు అనిల్‌కుమార్‌రెడ్డి (సోమందేపల్లి), అతడి స్నేహితులు సోమందేపల్లికి చెందిన వెంకటేష్, నరేష్‌తో కలసి రాజశేఖర్‌ను కిడ్నాప్‌చేసి, హత్య చేయాలని పథకం వేశారు. ఆ మేరకు ఈనెల 11న సాయినాథరెడ్డికి చెందిన కారులో మైలేపల్లి విజయ్‌కుమార్ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న రాజశేఖర్‌పై ఇనుపరాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశారు. అతడిని కారులో వేసుకుని అమిదాలకుంట, సీకేపల్లి మీదుగా వెంకటగిరిపాలెం చేరుకున్నారు. అక్కడ రాధికతో చెప్పుతో కొట్టించారు. రాజశేఖర్‌ను అక్కడి నుంచి కొట్టుకుంటూ తీసుకొచ్చి, మైలేపల్లి ఫాంహౌస్‌లో పడేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ చనిపోయాడు. అతడి భార్య స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐ ఇందిర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం మరకుంటపల్లి వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్



# శేషజీవితం సంఘ సేవలో...

- రిటైర్డ్ ఉద్యోగులకు అండగా కదిరి తాలూకా పెన్షనర్ల సంఘం
- ప్రయోజనాల సాధనకు పాటుపడుతున్న వైనం
- నేడు పెన్షనర్ల దినోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం నుంచి రిటైర్ అయిపోయామనీ, వయసు అయిపోయిందని అలసిపోలేదు. సేవలకు స్వస్తి చెప్పలేదు. తమ ఉద్యోగ జీవితానుభవంతో సంఘ శ్రేయస్సుకు పాటు పడుతున్నారు. వారే కదిరి తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు. యువకులు, యువజన సంఘాలతో పోటీపడుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019 డిసెంబరు 19న ఏర్పాటైన ఈ సంఘం అనేక సేవాకార్యక్రమాలు చేపడుతోంది.

### సేవాకార్యక్రమాల్లో..

ఉద్యోగ విరమణ చేసిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సంఘంగా ఏర్పడ్డారు. మొదట వందమంది సభ్యులతో ఏర్పాటైన సంఘం ప్రస్తుతం 1100 మందికి చేరుకుంది. సంఘ సేవలో భాగంగా ప్రధాన కార్యదర్శి ఆత్మారెడ్డి పర్యవేక్షణలో పలువురు కార్యవర్గ సభ్యులు వివిధ కార్యక్రమాలు చేస్తున్నారు. అందులో భాగంగా పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల కోసం సబ్‌ట్రెజరీకి సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల ఇప్పించడం, రీయింబర్సుమెంటు ప్రతిపాదనలు పంపడం, మృతిచెందిన పెన్షనర్ల కుటుంబాలకు పెన్షన్ వచ్చేందుకు ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికలు ఇవ్వడం, వయసు ప్రాతిపదికన పెరిగే పెన్షనర్లకు ప్రతిపాదనల తయారీ వంటి కార్యక్రమాలు దగ్గరుండి చేస్తుంటారు. ప్రతి ఏటా జనరల్, కంటి, కీళ్ల తదితర ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ పర్వదినాలు, జాతీయ పండుగలు, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.


సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

### పెన్షనర్స్ డే నేపథ్యం

ఆంగ్లేయుల పాలనలో ఉద్యోగికి సంపూర్ణమైన హక్కులుండేవికావు. హక్కులు పరిమితంగా ఉండటంతో వారి ఐక్యత కూడా అత్యల్పంగా ఉండేది. ఉద్యోగ విరమణ తరువాత పెన్షన్ అత్యల్పంగా ఉండేది. 1889లో పింఛన్ విధానం ప్రారంభమైనప్పటికి అది నామమాత్రగానే ఉండేది. 1920 బ్రిటిష్ కాలంలో రిటైర్డ్ బెనిఫిట్ పెన్షన్ ప్రవేశపెట్టారు. ఢిల్లీ మిలటరీ అధికారి డీఎస్ నకారా పెన్షన్ కోసం పోరాటాన్ని దశవారిగా చేశారు. పెన్షన్‌ను రాజ్యాంగ బద్ధమైన హక్కుగా గుర్తించాలంటూ న్యాయపోరాటం చేశారు. 1980 దశకంలో పలు పోరాటాలు చేయడంతో ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 అమలులోకి వచ్చాయి. 1981లో కుటుంబ పెన్షన్‌ను అమలు చేశారు. 1982 డిసెంబరు 17న సుప్రీంకోర్టు న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ తీర్పు చెప్పారు. నాటి నుంచి జాతీయ స్థాయిలో పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నారు. ఆ తీర్పు నేడు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. తీర్పువచ్చిన రోజున పెన్షనర్ల దినోత్సవంగా 1983నుంచి చేసుకుంటున్నారు.

### నేడు సీనియర్ పెన్షనర్లకు సన్మానం

పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా 75ఏళ్లు పైబడిన పెన్షనర్లను సత్కరించనున్నారు. సంఘం భవనంలో మంగళవారం ఉదయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

### ఒకరికొకరు తోడుగా...



ఒకరికొకరు తోడుగా సమష్టి కృషితో ఏర్పాటు చేసుకున్న సంఘమే ఇది. రిటైర్డ్ అనే పదం వినగానే ప్రతిఒక్కరిని అదో రకమైన భయం వెంటాడుతుంది. వృద్ధాప్యం మీదపడటంతో కొంతమంది కుటుంబ సభ్యుల నుంచే చులకనగా చూడబడారు. మరికొంతమంది కుటుంబాలకే భారమవుతారు. ఎవరికి ఎలాంటి సాయం చేయడానికైనా సంఘం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది. ఇదే పెన్షనర్లలో ధైర్యం నింపుతోంది. అధ్యక్షుడిగా ప్రతి పనిని భారంగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నా.

-శివారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు

### మానసిక సంతృప్తి



ఈ సంఘం ద్వారా అందిస్తున్న సేవలతో ఎంతో మానసిక సంతృప్తి కలుగుతోంది. ఇప్పటికే ఎన్నోసేవా కార్యక్రమాలు నిర్వహించాం. రోజురోజుకు మారుతున్న పెన్షన్ నిబంధనలను అధ్యయనం చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్నవారి ప్రయోజనాల కోసం సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సంఘం తరపున రిటైర్డ్ ఉద్యోగికి ప్రయోజనాలు సకాలంలో వచ్చేలా కృషి చేస్తున్నాం. ఈసంఘంలో వివిధ శాఖల రిటైర్డ్ ఉద్యోగులు దాదాపు 11వందల మంది ఉన్నారు. వారందరికీ సంఘం అండగా నిలుస్తుంది.

-ఆత్మారెడ్డి, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

**న్యూస్ బాక్స్**

### ఆత్మవిశ్వాసంతోనే క్రీడల్లో విజయం

- ఎస్కేయూ వీసీ అనిత


క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలంటే ఆత్మవిశ్వాసం ముఖ్యమని ఎస్కేయూ వీసీ అనిత పేర్కొన్నారు. వర్సిటీ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల ప్రారంభోత్సవం సోమవారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ఎస్కేయూ వీసీ అనిత మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే ప్రాతినిధ్యం ముఖ్యమన్నారు. అనంతరం ఆర్డీటీ స్టేడియంలో ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో ధర్మవరం డిగ్రీ కాలేజ్‌పై అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాల జట్టు, ఎస్కేయూ కాలేజీపై వాణి డిగ్రీ కాలేజీ జట్లు గెలుపొందాయి.

### జాతీయ చాంపియన్‌షిప్ అనంత కైవసం


చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న జిల్లా పారా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా వాసులు కైవసం చేసుకున్నారు. గుజరాత్‌లోని నదియాడ్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి అంధుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ తరఫున జిల్లాకు చెందిన నీలం సంజయ్‌రెడ్డి, షేక్ మహ్మద్‌షరీఫ్, నీలం పల్లవి, బలరాం, అనిల్‌కుమార్ ప్రాతినిధ్యం వహించారు. టీం చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచారు. దీంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

### జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా వాసులు..


నందీశ్వరి, సాలమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గురుకాశిలో ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ యూనివర్సిటీల బాక్సింగ్ పోటీలకు జిల్లాకు చెందిన దివ్యనందీశ్వరి, సాలమ్మ ఎంపికయ్యారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న వీరు ఎంపిక కావడం పట్ల డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, శాప్ కోచ్ ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీ శ్రీరామ్ అభినందనలు తెలిపారు.

### చీనీ టన్ను రూ.27,650

అనంతపురం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27,650 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడు పోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### వేతనాలు పెంచాలని మహిళా కార్మికుల ధర్నా

గోరంట్ల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి వద్దగల గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలు వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. మహిళాకార్మికులు విధులు బహిష్కరించి, పరిశ్రమ ముందు ఉదయంనుంచి బైఠాయించారు. దినసరి వేతనం రూ.350 చెల్లిస్తుండగా ఇటీవల ఆందోళన చేయడంతో కేవలం రూ.5 పెంచారన్నారు. రోజూ పరిశ్రమకు వచ్చి, వెళ్లడానికి బస్సు ఏర్పాటు చేసినా, నెలకు రూ.1200 వసూలు చేస్తున్నారని వాపోయారు. వేతనాలు పెంచడంతోపాటు రవాణా చార్జీలు యజమాన్యమే భరించాలని డిమాండ్ చేశా రు. హెచ్ఆర్ వేణుగోపాల్, డీజీఎం సురేష్.. ఆందోళనకారుల వద్దకెళ్లి చర్చించారు. సమస్యలను యజామన్యం దృష్టికి తీసుకెళ్తామనీ, విధుల్లోకి రావాలని కోరారు. కార్మికులు సమస్య తేలేవరకు ఆందోళన విరమించేదిలేదని సమీపంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిపై బైఠాయించారు. గంట తరువాత బెంగళూరు నుంచి గార్మెంట్స్ పరిశ్రమ ప్రతినిధులు మహదేవ్ గౌడ్, దినేష్ వచ్చి, వారితో చర్చించారు. వేతనం పెంపుపై యజమాన్యంతో చర్చిస్తామనీ, కొంత సమయం ఇవ్వాలని కోరడంతో వారు శాంతించి, మధ్యాహ్నం నుంచి విధులకు వెళ్లారు.


గార్మెంట్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

# రియల్ దందా..!



## రియల్టర్ల గుప్పిట్లో అసైన్డు భూములు
## జోరుగా నిషేధిత భూముల విక్రయాలు
## గుట్టువిప్పని రెవెన్యూ అధికారులు

గాండ్లపెంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జీవనో పాధి... ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అసైన్డు భూములను రైతులకు పంపిణీ చేసింది. దీంతో అనేక మంది రైతులు వాటిల్లో పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. దీంతో పలువురు కూలీలకూ ఉపాధి లభిస్తోంది. ఇటీవల భూముల ధరకు రెక్కలు రావడంతో రియల్టర్ల కన్ను వాటపై పడింది. తెప్పలు కుప్పలుగా.. అడ్డగోలు గా ఆ భూములు కొనుగోలు చేస్తున్నారు. ఇందులో పట్టా భూములతో పాటు అసైన్డు భూ ములనూ కొనుగోలు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా కదిరి, రాయచోటి రోడ్డుకు ఇరువైపుల ఉన్న భూములకు మంచి డిమాండ్ వచ్చింది. గ్రామాలకు దగ్గరంగా ఉంటే ఎకరా రూ.50 లక్షల నుంచి కోటి వరకు పలుకుతోంది. మండ లానికి సమీపంలోని భూములను రియల్టర్లు కొనుగోలు చేసి, భవనాల నిర్మాణం కోసం సెంట్లు వంతున అమ్ముతున్నారు. ఇప్పటికే గాండ్లపెంట, రెక్కమాను ప్రాంతాల్లో వందల ఎకరాల్లో ప్లాట్లు వేసి విక్రయించారు. ఈ ప్లాట్లకు అప్రూవల్ లేవు. ఈ ప్లాట్లలో రోడ్డు, మురుగునీటి కాలువలు, బడి, గుడి, విద్యుత్, నీరు... తదితర సదుపాయాలూ లేవు. యథేచ్ఛగా ప్లాట్లు వేసుకొని అమాయక ప్రజలను రియల్టర్లు మోసం చేశారు.. చేస్తున్నా రు. ఏకంగా ప్రభుత్వం వ్యవసాయ సాగుకు ఇచ్చిన భూముల్లోనూ రియల్టర్లు కొనుగోలుచేసి ప్లాట్లు వేసి విక్రయించి.. సొమ్ము చేసుకున్నారు. రెక్కమానులో ఓ రైతుకు ప్రభుత్వ భూమిని 4.58 ఎకరాల మంజూరు చేసింది. ఈ భూమిని ఆ రైతు పిల్లలకు వాటాలుగా పంచాడు. దీన్ని ఆసరగా చేసుకుని రియల్టర్లు అసైన్డు భూమిని కొనుగోలు చేసి, గత వైసీపీ పాలనలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రియల్టర్లు అసైన్డు భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి.. తరువాత భూమిని చదును చేసి, ప్లాట్లు వేసి, సెంటు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారు. ఇదంతా కళ్లముందే జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం విశేషం. ఈ తతంగంలో వారికీ వాటాలు ఉండటంతోనే వారు స్పందించడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

● వంకలు సైతం కబ్జా

ఎగువ ప్రాంతాల నుంచి ఆయా చెరువులకు వర్షపు నీరు వెళ్లడానికి ప్రభుత్వం వంకలు ఏర్పాటు చేసింది. రియల్టర్లు వంకలను ఆక్రమించుకుని వాటికి మట్టిని వేసి, ప్లాట్లుగా మార్చేస్తున్నారు. దీంతో భారీ వర్షాలు వస్తే వర్షపు నీరు పొలాల్లోకి వచ్చి.. పంటలు నాశనం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గుర్తించిన వాగు, వంకలను సైతం రియల్టర్లు పూడ్చివేస్తున్నారు.

రియల్టర్లు కొనుగోలు చేసిన అసైన్డు భూమి



వంకను పూడ్చివేసిన దృశ్యం

● రియల్టర్లు ఇతర ప్రాంత వాసులు మండలంలో భూములు తక్కువ ధరలకు కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి రియల్టర్లు అధికంగా వస్తున్నారు. ఈ ప్రాంతంలో తక్కువ ధరలకు భూములు దొరుకుతుండడంతో సుదూర పట్టణ ప్రాంతాల వాసులు వచ్చి పట్టా భూములతోపాటు అసైన్డు భూములను కొనుగోలు చేస్తున్నారు. పది సంవత్సరాలుగా రైతులు సాగుచేసిన ప్రధాన పంట అయిన వేరుశనగ, కంది ఏటా నష్టాలు చవి చూస్తున్నారు. పంటలు సాగుచేయలేక భూములు బీళ్లుగా మారుతున్నాయి. దీన్ని అదునుగా తీసుకొని.. పట్టాభూములకు ఓ ధర. అసైన్డు భూములకు మరో ధర నిర్ణయించి రియల్టర్లు కొనుగోలు చేస్తున్నారు.

● వైసీపీ హయాంలో జోరుగా విక్రయాలు..

గత వైసీపీ ప్రభుత్వంలో అసైన్డు భూమును క్రయవిక్రయాలు జోరుగా జరిగాయి. దీంతో డబ్బున్నవారు అసైన్డు భూములను భారీస్థాయి లో కొనుగోలు చేశారు. వీటిపైన కూటమి ప్రభు త్వం రాగానే ఆంక్షలు పెట్టడంతో గుట్టుచప్పుడు కాకుండా ఉండిపోయారు. అసైన్డు భూములు భారీస్థాయిలో విక్రయాలు జరిగాయి. అయితే వాటి వివరాలు తమవద్ద లేవని రెవెన్యూ అధికారులు అంటూ చేతులు దులిపేసుకొంటున్నారు.

### చర్యలు తప్పవ్

పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డు భూములను ఎవరూ కొనరాదు. వాటిని ఎవరైన కొని.. ప్లాట్లు వేసి ఉంటేవారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

-బాబురావు, తహసీల్దార్

---

## నేడు రెవెన్యూ సదస్సులు

గాండ్లపెంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబురావు తెలిపారు. వేపరాల పంచాయతీలోని తాళ్లకాలువ, చిన్నక్కగారిపల్లి, నీఎం తండాల రైతులు, ప్రజలు వారి సమస్యలపై వినతులు ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● కదిరి అర్బన్: కొండమనాయునిపాళ్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీక్రిష్ణ తెలిపారు. గొల్లోలచెరువు, చవిటితండా, చిగురుమాను తండా ప్రజలు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

●నంబులపూలకుంట : మండలంలోని పెడబల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జీ తహసీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు. పెడబల్లి, నాగంవారిపల్లి, నల్లగుట్టపల్లితండా, పి.గొల్లపల్లి గ్రామస్థులు వారి వారి సమస్యలపై ఇందులో వినతులు ఇవ్వాలని కోరారు.

●నల్లమాడ మండలంలోని పాతబత్తపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. పాతబత్తలపల్లి, తోలేటిపల్లి, కమ్మవారిపల్లి, యనుములవారిపల్లి, నల్లశింగయ్యగారిపల్లి గ్రామాల ప్రజలు ఏ సమస్యలున్నా వినతిపత్రాలు అందజేయాలన్నారు.

## చెర్లోపల్లి నుంచి త్వరలో కదిరికి తాగునీరు



చెర్లోపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కదిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరి పట్టణానికి తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ డీఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం చెర్లోపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడారు. అమృత్ 2.0 పథకం కింద తాగునీరు పట్టణానికి అందించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం నీటిని కేటాయించిందని, అందులో భాగంగానే పట్టణానికి నీరు అం దించడానికి పరిశీలించామని అన్నారు. ఆయనతోపాటు ఇరిగేషన్ ఈఈ ఆదినారాయణ, డీపీహెచ్ఓ నరసింహమూర్తి, ఇరిగేషన్ ఏఈ ఉన్నారు.

## అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ధర్మవరంరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ సాయిమనోహర్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై తొమ్మిది అంశాలను వివరించారు. అనంతరం శిక్షకులు అభివృద్ధి ప్రణాళికలో లక్ష్య సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామరెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, వ్యవసాయ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు, ఏఎన్ఎంలు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: ఆదావనరులతో గ్రామాలాభివృద్ధి అనే అంశంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రీసోర్సు పర్సన్స్ సోమవారం శిక్షణాతరగతులు నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఈఓఆర్డీ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● తనకల్లు: గ్రామాల్లో 2025-26లో సాధించాల్సిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపైన సోమవారం ఎంపీడీఓ కార్యాల యంలో శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, సాధించాల్సిన లక్ష్యాలను ఎలా నిర్ధారించుకో వాలో ఈ శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామాభివృద్ధి ప్రణాళికలపై సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపికారెడ్డి మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన, అందరికి విద్య, ఆకలి లేని సమాజం, పర్యావరణ పరిరక్షణపై వివరించారు.

● నల్లమాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిలపై ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్ట్సు విల్సన్ సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి, ఈఓఆర్డీ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడిమర్రికి చేరిన పీఏబీఆర్ నీరు




నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న పీఏబీఆర్ డీఈ

తాడిమర్రి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ ద్వారా విడుదలైన నీరు సోమవారం తాడిమర్రి మండలంలోని 108వ కిలోమీటర్ల వద్దకు చేరింది. ఆ నీటిని పరిశీలించిన పీఏబీఆర్ డీఈ రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ.. ముందుగా చివరిలో ఉన్న అగ్రహారం చెరువుకు.. ఆ తరువాత మేడిమాకులపల్లి, తాడిమర్రి తూర్పు, పడమర చెరువులకు నీరు వదుల ుతామన్నారు. రైతులు ఎవరూ నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయరాదని, ఎక్కడా కూడా మధ్యలో నీటిని తరలించే ప్రయత్నం చేయరాదని అన్నారు. అక్రమాలకు పాల్పడే రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సహకరిస్తే ప్రతి చెరువుకూ నీరందిస్తామన్నారు.

## పంచాయతీ కార్మికుల వివరాలు ఇవ్వండి

తనకల్లు: మండలంలోని 17 పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలు తెలపాలని సత్యసాయి వర్కర్సు ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఎంపీడీఓ పూల రెడ్డెప్పకు సోమవారం వినతి పత్రం అందించారు. పంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి నెలనెల ఎంత వేతనం ఇస్తున్నారో కూడా తెలిచేయాలని కోరారు. ఆ వివరాలను తెలుసుకుని కార్మికులందరిని కూడ గట్టుకుని కనీసం వేతనాల కోసం ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



కొత్తరోడ్డు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నంబులపూలకుంట : ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయక పోవడంతో ప్రలు ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం మండలంలోని ధనియాన్ చెరువులో వృద్ధురాలు సాలెమ్మ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మరణిం చిన విషయం తెల్సిందే. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. మండల కేంద్రానికి సమీపంలోని కొత్తరోడ్డు నాలుగురోడ్లకూడలిలో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

---

# రస్తా ఆక్రమణకు కుట్ర!

◆ బీజేపీ ముసుగులో వైసీపీ నేత దందా
◆ ఇంటి నిర్మాణ పనులు చేపట్టేయత్నం
◆ పార్థసారథినగర్-2 కాలనీ వాసుల అభ్యంతరం
◆ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు

ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి బీజేపీలో చేరిన ఓ నేత యథేచ్ఛగా తన ఆక్రమణల పర్వాన్ని కొనసాగించడానికి యత్నిస్తున్నాడు. వైసీపీ హ యంలో ఆ పార్టీకి చెందిన ఓ నాయకుడు పట్టణంలోని పార్థసారధి నగర్-2లో సర్వేనెంబరు 650లో 33 అడుగుల ప్రధాన రస్తా స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నాడు. ఆ స్థలాన్ని కబ్జా చేసి.. ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాడు. ఈ విషయాన్ని ఆ ప్రాంత వాసులు అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి ఆ నాయకుడిని పిలిపించి రస్తా జోలికి వెళ్లితే బాగుండదని మందలించినట్లు సమా చారం. దీంతో ఆ వ్యక్తి నాడు మిన్నకుండి పోయా డు. ఆ తరువాత ఎన్నికల ముందు ఆ నాయకుడు బీజేపీలో చేరాడు. నేడు మళ్లీ బీజేపీ ముసుగులో ఆ రస్తాను కబ్జా చేయడానికి పూను కున్నాడు. ఆ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించ డానికి ఏకంగా రాళ్లను తోలించాడు. దీంతో ఆ ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఇంటి నిర్మాణం మొదలు .పెడితే తమ దృష్టికి తీసుకు రావాలని... అప్పుడు అడ్డుకుంటా యని ఆ ప్రాంత వాసులకు చెప్పారు. పట్టణంలో ఇటీవల కాలంలో వైసీపీ నుంచి బీజేపీలో చేరిన నాయకులే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతు న్నారని, వాటిపై మంత్రి దృష్టి సారించక పోతే బీజేపీకి చెడ్డపేరు వస్తుందని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆ పార్టీ నాయకులే కోరుతున్నారు.



రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణానికి తోలిన రాళ్లు

### చర్యలు చేపడతాం

పట్టణంలోని పార్థసారధినగర్‌లో 650 సర్వేనెంబరులో రస్తా ఆక్రమణ విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని పంపించి విచారించి తగిన చర్యలు చేపడుతాం. అక్రమ నిర్మాణాలను తప్పకుండా అడ్డుకుంటా.

- ప్రమోద్‌కుమార్, కమిషనర్, ధర్మవరం

---



స్వామి వారిని ఊరేగిస్తున్న మాలధారులు

## మదగజవాహనంపై ఊరేగిన అయ్యప్ప

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన సోమవారం మదగజవాహనంపై మణికంఠ స్వామి విగ్రహాన్ని ఎం. కొత్తపల్లి, వడ్డివారిపల్లి, ఓడీసీ పురవీధుల్లో ఊరేగించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. రెండో రోజైన మంగళవారం అశ్వవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తామన్నారు.

## చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు



ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ప్రారంభాన్ని పురష్కరించుకొని.. స్థానిక లక్ష్మీచెన్నకేశవుడి ఆలయంలో సోమ వారం అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి తులసి ఆకులు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్ నాయుడు, చిన్నూరు విజయ్‌చౌదరి, అశోక్, అన్నమయ్య సేవామండలి సభ్యులు పాల్గొన్నారు.

## త్రిలింగేశ్వరుడికి రుద్రాభిషేకం



ధర్మవరంరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిలింగేశ్వర ఆలయంలో సోమవారం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాఘవశర్మస్వామి శివ పార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, భస్మాభిషేకం, పార్థివ లింగ పూజ, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు.

## విద్యార్థుల అదృశ్యం

తనకల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి, విద్యార్థిని శనివారం రాత్రి అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎస్ఐ గోపిని అడగ్గా.. విద్యార్థిని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ న్యాయవిజ్ఞాన సదస్సు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పరిధిలోని ఎను మలపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో జాతీయ న్యాయవిజ్ఞాన సదస్సును పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ సోమవారం నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అక్కడికి సమీపంలోని భవిత పాఠశాలలో విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర, మూగ, చెవుడు ఆర్థోపెడిక్ తదితర రుగ్మతలకు వైద్యనిపుణులతో చిన్నారులకు చికిత్సలు నిర్వహించారు. లోపాలకు అనుగుణంగా వారికి అవసరమయ్యే పరికరాలను అందజేశారు. భవిత సెంటరులో ఉన్న చిన్నారుల మానసిక పరిస్థితిపై ఆరా చేశారు. భవిత చిన్నారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమాల్లో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు లెక్కల యుదభూషణ్, చల్లా చంద్రశేఖర్, పూజారిప్రసాద్, భారతీరెడ్డి, కిరణ్ సతీష్, కోర్టు సూపరింటిండెంట్ బాలాజీనాయక్, ఎల్‌సీ లక్ష్మానాయక్, వైద్యులు జ్యోత్స్న, చంద్రికాభవ్య, అనూరాధ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్

## మినీగోకులాలను త్వరగా నిర్మించుకోండి

ధర్మవరంరూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ నిధులతో పాడిరైతులకు మినీగోకులాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటి నిర్మాణాలను రైతులు త్వరతగతిన పూర్తి చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీడీ వెంకట చలపతి సూచించారు. సోమవారం మండలంలోని చిగిచెర్లలో పాడిరైతు నారాయణస్వామికి చెందిన నిర్మాణ దశలో ఉన్న మినీగోకులాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. సకాలంలో వాటిని నిర్మించుకుంటే రైతులకు భారం కాకుండా బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద మంజూరైన మామిడి మొక్కలను ఆయన పరిశీలించారు. కూలీలు చేస్తున్న ఫారం ఫౌండ్ పనులను పరిశీలించి కొలతలకు అనుగుణంగా పనిచేస్తే పూర్తిగా కూలి లభిస్తుందన్నారు. ఆయన వెంట ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫీల్డ్‌అసిస్టెంట్ హేమంత్ ఉన్నారు.

## పేదలకు ఇంటిపట్టాలివ్వండి

ధర్మవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమిని.. పేదలకు ఇళ్లపట్టాలుగా మంజూరు చేయాలని సత్యసాయి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ కతిజన్‌ఖుబ్రాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 281-ఏలో దాదాపు మూడు ఎకరాలు ప్రభుత్వ భూమి చెరువు కింద ఉందని, దాన్ని లింగమశెట్టికుంటగా పిలుస్తారని తెలిపారు. కొందరు కబ్జాదారులు ఆ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఏకంగా ప్లాట్లు వేసి అమ్మకాలు చేపట్టారన్నారు. కావున ఆ భూమిని కాపాడి పేదలకు ఇళ్లపట్టాలుగా ఇవ్వాలని ఆయన కోరారు.

---



పతకాలు సాధించిన విద్యార్థులు

## రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో ప్రతిభ

నల్లమాడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓడీసీలోని విజ్ఞాన్ పాఠశాల ఆవరణంలో ఈనెల 13,14 తేదీలో నిర్వహించిన ఐదో రాష్ట్రస్థాయి జూనియర్ జంప్‌రోప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్థానిక బాలుర ఎస్టీ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, వార్డెన్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఆ పోటీల్లో తొమ్మిది స్వర్ణ పతకాలు, ఒక కాస్యం పతకం సాధించినట్లు చెప్పారు. ఈపోటీల్లో అర్జున్‌నాయక్, జయంత్‌నాయక్, భాస్కర్‌నాయక్, రాజేష్‌నాయక్, చాప్లానాయక్, లిఖిత్‌నాయక్, వివేక్‌కుమార్‌నాయక్, గిరిధర్‌నాయక్, సోమేష్‌నాయక్, స్వర్ణ పతకాలు, అలాగే సంతోష్ కాస్యం పతకం సాధించినట్లు తెలిపారు. వీరు జనవరిలో రాజస్థాన్‌లో జైపూర్‌లో నిర్వహించే జాతీస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థులను ఆ పాఠశాల సిబ్బంది అభినందించారు.

## జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



ఈశ్వర్‌సాయి

కదిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కాటం ఈశ్వర్ సాయి ఢిల్లీలో జరిగిన 68వ జాతీయస్థాయి పాఠశాల బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచినట్లు విద్యార్థి తండ్రి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదో తరగతి చదువుతున్న కాటం ఈశ్వర్‌సాయి అండర్-14 బాలుర విభాగంలో పోటీ పడ్డాడన్నారు. డిసెంబరు 9నుంచి 13వరకు ఢిల్లీలో జరిగిన ఆ పోటీల్లో ద్వితీయస్థానం సాధించారన్నారు. ఈశ్వర్ స్థానిక కందికుంట వెంకటప్రసాద్ ఇండోర్ స్టేయంలో నిత్యం శిక్షణ పొందేవారన్నారు.

## జాతీయస్థాయి డ్యాన్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న ఓడీసీ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలకు స్థానిక జ్ఞానసాయి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె. క్రిష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఏపీ డ్యాన్స్ కోర్సు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కదిరి వాల్మీకి పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. పంజాబ్‌లోని రూధియానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

## ఆలిండియా రగ్బీ పోటీలకు..



పోతిరెడ్డి

ధర్మవరం,డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న పోతిరెడ్డి ఆలిండియా రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. గతనెల10న అనంతపురంలో ఎస్కేయూ నిర్వహించిన రగ్బీ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి వర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఈ విద్యార్థి ఈనెల 17న పంజాబ్‌లోని చండీగర్ యూనివర్సిటీలో నిర్వహించే ఆలిండియా రగ్బీ పోటీల్లో పాల్గొంటారన్నారు. పోతిరెడ్డిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ ఆనంద్, అధ్యాపకులు అభినందించారు.

## జూదరుల అరెస్టు

బత్తలపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీ వద్ద సోమవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సోముశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ.8,540 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్తం

## లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం



శాశ్వత సభ్యత్వ రసీదును అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గాంధీ సర్కిల్లో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పారిశ్రామికవేత్త పరిగి సత్యనారాయణ రూ.2,01,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు ఆయనకు శాశ్వత సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు జేవీ వెంకటస్వామి, అధ్యక్షుడు రాఘవేంద్ర, కమిటీ సభ్యులు ఆకుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పూజకు రూ.1.16 లక్షలు..



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న వెంకటశివారెడ్డి

గోరంట్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దామరవొడ్డు అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ కోసం నారసింపల్లి మాజీ సర్పంచ్ వెంకట శివారెడ్డి సోమవారం రూ.లక్ష 16వేల విరాళం అందచేశారు. ఈనెల 22న అయ్యప్ప మండల పూజ నిర్వహిస్తున్నారు. గత 8 సంవత్సరాలుగా వెంకటశివారెడ్డి కుటుంబ సభ్యులు మండల పూజకు పెద్దఎత్తున విరాళాలు అందచేస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. దీంతో అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు ఆయనను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వాములు రుషేంద్ర, నరసింహులు, కమిటీ సభ్యులు బాలరంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, కృష్ణమాచారి పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో
### - ఒకరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయరహదారిపై ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుంచి ఆటో ఢీకొనడంతో హర్షవర్ధన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సోమందేపల్లి మండలం వెలగమాకులపల్లికి చెందిన హర్షవర్ధన్ ద్విచక్రవాహనంలో పెనుకొండ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా పులేకమ్మ ఆలయం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

## యూటీఎఫ్ మోడల్ పేపర్ ఆవిష్కరణ

చిలమత్తూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ నాయకులు సోమవారం స్థానిక ఎమ్మార్సీలో మోడల్ పేపర్‌ని ఆవిష్కరించారు. ప్రతి ఏడాది అందజేస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా పదో తరగతి విద్యార్థుల కోసం తక్కువ ధరతో అన్ని సబ్జెక్టులకు సంబంధించి సులభమైన మోడల్ పేపర్‌ని విడుదల చేసినట్లు యుటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మోడల్ పేపర్ ద్వారా పరీక్షల్లో 70 నుంచి 80 మార్కులు సాధించేందుకు వీలు పడుతోందన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు లక్ష్మీపతి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నంజప్ప, ఆంజినేయులు, సురేష్‌కుమార్, జగదీష్, ముత్యాలప్ప, చిత్ర పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ

సోమందేపల్లి/అగళి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీల సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల ప్రణాళికపై సోమవారం సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రెండో విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎంపీడీఓ మమతదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఆదాయ వనరులను కనుక్కొని పంచాయతీలకు వస్తున్న నిధులను కలిపి చేపట్టాల్సిన పనులను రూపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజాప్రతినిధులతో కలిసి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో ప్రజలకు ఎలాంటి అవసరాలున్నాయో గుర్తించాలని పేర్కొన్నారు. అగళి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బందికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదవేంద్ర, ఏపీ శివన్న, వ్యవసాయశాఖ అధికారి శేఖర్ నాయక్, డాక్టర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

## గడ్డివాములు దగ్ధం

గోరంట్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లన్నపల్లికి చెందిన రైతు కురబ ఈశ్వరప్పకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ మేరకు రైతు గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరప్ప పాడి పశువులకు కోసం రెండు ట్రాక్టర్ల వేరుశనగ గ్రాసం కొనుగోలు చేసి ఇంటి సమీపంలో వామి వేసుకున్నారు. అలాగే రెండు ట్రాక్టర్ల మొక్కజొన్న గ్రాసాన్ని అక్కడే భద్రపరిచారు. ఆదివారం రాత్రి తనను ఆర్థికంగా నష్టపరచడం కోసం గిట్టనివారు గడ్డివాములకు నిప్పు అంటించినట్లు రైతులు చెప్పారు. అగ్నిమాపక యంత్రం వచ్చేసరికి గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయని, మంటలు ఆర్పివేశారన్నారు.

## పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి


హిందూపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఆర్య వైశ్య సంఘం నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణ పరిధిలోని పొట్టి శ్రీరాములు పాఠశాలలో 1నుంచి 5వ తరగతి చదువుతున్న 110 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్సులు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాసా సందేశ్, దాసా గంగాధర్, సూర్యనారాయణ, రాజేంద్ర, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సామగ్రి అందజేసిన దృశ్యం

# శిథిలం.. ప్రమాదభరితం

- మరమ్మతులకూ నోచని వైనం
- పంచాయతీరాజ్ కార్యాలయం దుస్థితి
- బిక్కుబిక్కుమంటూ విధులు



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గదిలో ఊడిన పైకప్పుపెచ్చులు, ల్యాబ్ గదిలో.. కిటికీ వద్ద బయటపడిన కడ్డీలు

హిందూపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, రోడ్ల ఏర్పాటుకు రూ. వందల కోట్ల చెక్కులు అందించిన కార్యాలయం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో మూడు దశాబ్దాల క్రితం పంచాయతీరాజ్ కార్యాలయం నిర్మించారు. ఒకే భవనంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ కార్యాలయం ఉన్నాయి. పై అంతస్తులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కార్యాలయ మరమ్మతులకు, నిర్వహణకు ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వలేదు. దీనికితోడు 2019 నుంచి 2024వరకు ఈ రెండు శాఖలు నిర్వీర్యమయ్యాయి. గత తెలుగుదేశం హయాంలో ఈ రెండు కార్యాలయాలు కళకళలాడేవి. వైసీపీ పాలనలో ఈ శాఖలకు ఒక్కరూపాయి కూడా నిధులు ఇవ్వకపోవడంతో కార్యాలయాల వైపు కాంట్రాక్టర్లు తొంగిచూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి పంచాయతీరాజ్ ద్వారా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 40 శాతం బిల్లులు కూడా మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి కూడా 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడంతో నాయకులు, కాంట్రాక్టర్లు, సర్పంచులు కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. కార్యాలయంలో పై పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెచ్చులూడి కిందపడి వర్షపు నీరు కార్యాలయంలో కారుతుండటంతో రికార్డులు భద్రపరచడానికి ఉద్యోగులు నానా తంటా పడ్డారు. పైపెచ్చులూడి ఇనుప కడ్డీలు కనబడుతుండటంతో అక్కడ పనిచేసే ఉద్యోగులు బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అక్కడ పనిచేసే ఉద్యోగులతోపాటు కార్యాలయానికి వెళ్లే నాయకులు, సర్పంచులు కోరుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో చేతికర్ర ప్రదర్శన

పెనుకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బాబయ్యస్వామి 752వ గంధం వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆశె బాబయ్య స్వామి చేతికర్రను దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా, ఆయన కుమారుడు, కాబోయే పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా ప్రదర్శించారు. అనంతరం దర్గాలోని ఐదు పీర్లను ఏడు ప్రదర్శనలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కోరికలు, సమస్యలు తీరాలని మొక్కుకున్నవారు దీపారాధన సందర్భంగా కొబ్బరి కాల్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం రాత్రి ఉరుసుకు వచ్చిన భక్తులు దర్గా వద్ద తమ స్థోమతకు తగ్గట్టు కిలో నుంచి 10 కిలోల వరకు ఎండు కొబ్బరి కాల్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు దర్గా పీఠాధిపతి బహుమతులు అందజేశారు.



బాబయ్యస్వామి చేతికర్రను ప్రదర్శిస్తున్న పీఠాధిపతి, కొబ్బరి కాల్చి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

# కాశీవిశ్వేశ్వర ఆలయ పూజల్లో మంత్రి సవిత

పెనుకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన మంత్రి సవితను అర్చకులు చంద్రశేఖర్‌స్వామి, కమిటీ సభ్యులు డాక్టర్ రంగనాథరావు, తదితరులు స్వాగతం పలికారు. పూజల అనంతరం పూలమాలలువేసి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.

### టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పెనుకొండరూరల్: రొద్దం మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త శ్రీరామప్ప రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత లోచర్ల గ్రామానికి చేరుకుని శ్రీరామప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేశారు. అనంతరం రొద్దం మండలం బీదానపల్లిలో భక్త కనకదాస జయంతిని పురస్కరించుకుని కురుబ కులస్థులు భక్తిశ్రద్ధలతో జ్యోతులు సోమవారం మోశారు. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత కురుబ కులస్థులతో కలిసి కనకదాస చిత్రపటానికి నివాళులర్పించి జ్యోతులు సమర్పించారు.



మంత్రి సవితను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

## ట్రూఅప్ చార్జీలు తొలగించాలని నిరసన



విద్యుత్ బిల్లులను తగులబెడుతున్న నాయకులు

పెనుకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ట్రూ అప్ భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ పార్టీల నాయకులు విద్యుత్ చార్జీల బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తెలుగుతల్లి సర్కిల్ వద్ద సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు హరి, రమేష్, బాబావలి, గంగాధర్, నాగరాజు, ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చినమాట నిలబెట్టుకోకుండా ప్రజలపై విద్యుత్‌చార్జీలను మోపడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిస్సార్, వెంకటేశ్, భాష, నరసింహులు, ఆరీఫ్, నాగప్ప పాల్గొన్నారు.

**చిలమత్తూరు** : ట్రూ అప్ చార్జీల పేరుతో పేద ప్రజల నడ్డి విరిచేలా విద్యుత్ చార్జీలు పెంచారని, వెంటనే తగ్గించాలంటూ సీపీఎం నాయకులు సోమవా రం నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రామచం ద్ర, నాగరాజు, రహంతుల్లా, అశ్వర్థరెడ్డి, రజియాభాను, సావిత్రమ్మ తదితరులు మండల కేంద్రంలో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను తగులబెట్టారు.

## స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌శెట్టి



కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పావగడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతి పెద్ద సోలార్ పార్కు పావగడ తాలూకా వ్యాప్తంగా నిర్మాణమవుతున్నప్పటికీ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం దారుణమని, ఈ వ్యవహారం ఇలాగే కొనసాగితే పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ శెట్టి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గురుభవన మైదానంలో కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పావగడ చుట్టుపక్కల ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కావడంతో కన్నడ భాష పట్ల అవగాహన కల్పించి కన్నడ వాతావరణం సృష్టించాల్సిన అవసరం ఉందని కన్నడ రక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమేష్‌గౌడ తెలిపారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు పాళేగార్ లోకేష్, నాయకులు నరసీ పాటేల్, అమీర్‌ఖాన్, రాము, మూర్తి, మంజు, కిరణ్ పాల్గొన్నారు.

# మెట్ల మీద పెట్టెలు.. విద్యార్థులకు ఇక్కట్లు

- కేజీబీవీని పట్టించుకోని అధికారులు
- కనీస సౌకర్యాలూ కరువే

పావగడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమం కోసం నెలకొల్పిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు తలదాచుకోవడానికి కూడా స్థలం లేక ఇక్కట్లు పడుతున్నారు. విద్యార్థులు తమ దుస్తులు, పుస్తకాలు భద్రపరుచుకునే ట్రంకు పెట్టెలకు కూడా స్థలం లేకపోవడంతో మెట్లపైనా, మంచాలపైనా పెట్టుకోవాల్సిన వస్తోందని వాపోతున్నారు. తుమకూరు జిల్లాలోనే వెనకబడిన పావగడ తాలూకాకు కేజీబీవీ మంజూరై 20 సంవత్సరాలు పైబడినా విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా గదులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు 240 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు గదులు లేక జూనియర్ కళాశాల, వేణుగోపాలస్వామి, రాష్ట్ర ప్రగతి ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం కోసం వెళుతున్నారు. 240 మంది విద్యార్థులకుగాను ఐదు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో ఉదయం వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా నాలుగు స్నానపు గదులు మాత్రమే ఉండడంతో నాలుగైదు రోజులకు ఒకసారి స్నానం చేయాల్సి వస్తోందని తెలిపారు. రాత్రిపూట ఒక్కొక్క బెడ్‌పైన ఇద్దరు ముగ్గురు విద్యార్థినులు నిద్రిస్తున్నారు. స్థలం చాలకపోవడంతో లగేజీ పెట్టెలను బయట మెట్లపై పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల బెడదతో నిద్రకూడా సరిగ్గా రాదని, డిజిటల్ గ్రంథాలయంకానీ, కంప్యూటర్ సౌకర్యం లేకపోవడంతో విద్యలో వెనుకబడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.



మెట్లమీద పెట్టెలు పెట్టిన విద్యార్థులు, కస్తూర్బా పాఠశాల

## సిద్దేశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



సిద్దేశ్వరస్వామి లక్ష దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

అమరాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన హెంజేరు సిద్దేశ్వరస్వామి లక్ష దీపోత్సవంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అమరాపురం మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, భక్తులు దేవాలయ సన్నిధికి చేరుకొని దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశులు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, ఈఓ నరసింహరాజు, నాయకులు జయకుమార్, రామచంద్రప్ప, కుమారస్వామి, తిప్పజ్జ, ఓంకార్‌స్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ రైడర్లకు పోలీసుల కౌన్సెలింగ్



బైక్ రైడర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్

సోమందేపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపి విన్యాసాలు చేస్తున్న బైక్ రైడర్లకు సోమవారం ఎస్ఐ రమేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. పెనుకొండ బాబయ్యస్వామి ఉరుసు సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వస్తుంటారు. ఈ దిశలో కొందరు ఆకతాయిలు జాతీయ రహదారిపై బైక్ రైడింగ్, ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ట్రాఫిక్ అంతరాయం చేయడమేకాక ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారని అప్రమత్తమైన పోలీసులు వారిని కట్టడిచేసే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హిందూపురానికి చెందిన పది మంది యువకులను ఎస్ఐ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చా రు. ఒక్కొక్కరికి రూ.1150 చొప్పున ఆన్‌లైన్ చలానాను కట్టించారు. మరోమారు పట్టుబడితే బైక్ సీజ్ చేసి, కేసు నమోదుచేస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వాలి



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫీజులతో నిమిత్తం లేకుండా డిగ్రీ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరలోనే చెల్లిస్తామని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆదేశించినా.. కళాశాలల యాజమాన్యాలు పెడచెవిన పెట్టి ఫీజులు చెల్లిస్తే తప్ప హాల్ టికెట్ ఇచ్చేది లేదని వేధించడం దారుణమన్నారు. ఫీజు డిమాండ్ చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, అజయ్, సురేష్, నరేష్, సాగర్, హరి ఉన్నారు.

## ఐముక్తేశ్వరుడికి అన్నాభిషేకం

పెనుకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతిపురాతనమైన ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. సోమవారం ధనుర్మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అర్చకులు కన్నన్‌స్వామి, మూర్తిస్వామి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలతోపాటు ప్రత్యేకంగా అన్నాభిషేకం నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామికి అన్నాభిషేకం

## హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయండి

పెనుకొండ రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని మంత్రి సవితకు హెల్త్ అసిస్టెంట్లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలో మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. 2002 వైద్య ఆరోగ్యశాఖ మల్టీ పర్పస్, కాంట్రాక్ట్ పద్ధతిలో రాష్ట్రస్థాయిలో 1500 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్రంలోని వెయ్యిమంది ఉద్యోగులను తొలిగించారన్నారు. ఉద్యోగాలు కోల్పోయినవారిలో 50 ఏళ్లకు పైబడినవారే ఉన్నారని, ఉన్నఫళంగా మా ఉద్యోగాలు పోతే కుటుంబాలు వీధినపడతాయని తెలిపారు.

## అన్నివర్గాలకు అందుబాటులో సేవలు
### - కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ లారెన్స్

అమరాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు తమ బ్యాంకు సేవలు అందుబాటులో ఉన్నాయని కెనరాబ్యాంకు జిల్లా మేనేజర్ లారెన్స్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అమరాపురం కెనరా బ్యాంకు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సోమవారం వీరశైవ కల్యాణ మండపంలో స్వర్ణోత్సవ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ కెనరా బ్యాంకు ద్వారా రైతులు, మహిళా సంఘాలు, వ్యాపారులకు రుణాలు అందజేస్తున్నామని, వాటిని సకాలంలో చెల్లించాలని కోరారు. ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మారుమూల ప్రాంతాలకు కూడా బ్యాంకు సేవలను విస్తరించాలని కోరారు. జడ్పీటీసీ నరసింహమూర్తి, సర్పంచు వాగేష్, తెలుగుదేశం నాయకులు మారుతీప్రసాద్, సురేష్‌రాజు, రాఘవేంద్ర గుప్తాను కెనరాబ్యాంకు సిబ్బంది సన్మానించారు. అనంతరం ఐదు మహిళా సంఘాలకు మంజూరైన రుణాలను సంఘాల సభ్యులకు ఆర్‌ఎం చేతులమీదుగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పెహరా టీటూప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ మనోహరాచారి, అసిస్టెంట్ మేనేజర్లు నాగార్జున, హరీష్, బ్యాంకు అధికారులు హరిప్రకాష్, వీరూపాక్షి, జయరాం, నవీన్, శివన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ లారెన్స్